ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం 6:26(సాయంత్రం)
సెహరీ : సోమవారం 4:45 (ఉదయం)

పండగ వచ్చే.. సందడి తెచ్చే..!

- శ్రీగిరిపై ఉగాది మహోత్సవాలు ప్రారంభం
- భృంగి వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి
- నేడు స్వామిఅమ్మవార్లకు కైలాస వాహన సేవ,
- మహాదుర్గగా దర్శనమివ్వనున్న అమ్మవారు
- భక్తులతో కిటకిటలాడి శ్రీశైల క్షేత్రం



భృంగి వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

శ్రీశైలం, ఏప్రిల్ 6: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం ఉగాది మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉగాది మహోత్సవాలు 10న ముగియనున్నాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి, స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. తరువాత వేదపండితులు చతుర్వేద పారాయణాలతో వేదస్వస్తి నిర్వహించారు. ఆ తరువాత దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆలయ అర్చకులు, వేదపండితులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. దీనికే శివ సంకల్పం అని పేరు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి పూజలు నిర్వహించారు. సాయంకాలం అంకురార్పణ కార్యక్రమం జరిపించారు.

భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల విహారం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం స్వామిఅమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించారు. అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట శంఖం, జే గంట, ఢమరుకం, కొమ్ము వాయిద్యం, కోలాటం, చెక్కభజన, వేషధారణలు, తప్పెట్లు, శంఖానాదాలు, కర్ణాటక జాంజ్, కర్ణాటక డోలు విన్యాసాలు, మంగళవాయిద్యాలతో కొనసాగింది. రాజగోపురం నుంచి గంగాధర మండపం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవ క్రతువు జరిగింది.



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో మహిళలు, చిన్నారులు





కర్ణాటక సంప్రదాయ నృత్య ప్రదర్శన



కళాకారుల ప్రదర్శన

మహాలక్ష్మిగా భ్రమరాంబికాదేవి



ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చతుర్భుజాలు కలిగిన ఈదేవి పైరెండు చేతులలో పద్మాలను, కింది చేతులలో కుడి వైపు అభయహస్తం, ఎడమ వైపు వరముద్రతో దర్శనం ఇచ్చారు.

నేడు కైలాసవాహన సేవ: ఉగాది మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం స్వామివారికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిని అయిన భ్రమరాంబిక దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు: ఉగాది మహోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం కూచిపూడి నృత్యం, సంప్రదాయ నృత్యం, ఆధ్యాత్మిక ప్రవచనం, వేణుగాన కచేరి, తబలా కచేరి, భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వహించింది.

పోస్టల్ బ్యాలెట్ కీలకం

- ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి ఆ సదుపాయం
- 33 నిత్యావసర సేవల సిబ్బందికి కూడా..
- ఫారం-12 డీ ద్వారా దరఖాస్తుకు ఏర్పాట్లు



నంద్యాల టౌన్, ఏప్రిల్ 6 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానం అత్యంత కీలకంగా పరిగణించబడుతోంది. ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల కమీషన్ కల్పిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 విభాగాలలో నిత్యావసర సేవలు (ఎసెన్షియల్ సర్వీసెస్) అందించే శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

పోలింగ్ రోజున ఓటు వేయలేని వారికి..

పోలింగ్ విధుల్లో ఉన్నవారితోపాటు నిత్యావసర సేవలకు సంబంధించి 33 శాఖల వారు ఓటు వేయలేని పరిస్థితి ఉంటుంది. పోలింగ్ సమయం పూర్తయ్యే వరకు విధుల్లో ఉండి, తదనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చే వరకు విధుల్లో భాగస్వామ్యం కావాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల కేటాయింపుల్లో సిబ్బందిని ఒక ప్రాంతం వారిని మరో ప్రాంతంలో విధులు నిర్వహించేలా డ్యూటీలు వేస్తారు. దీంతో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉండదు. ఇందు కోసం కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సదుపాయం కల్పించింది. ఈ మేరకు అర్హత ఉన్న వివిధ శాఖల సిబ్బంది వివరాలను ఇప్పటికే వెల్లడించింది. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం -12డీ ద్వారా వివరాలను పొందుపరిచి దరఖాస్తును నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ విభాగం పరిశీలన కోసం నోడల్ అధికారిని కూడా నియమించారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే విభాగాలు

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాలను వివిధ విభాగాలకు సంబంధించిన ప్రభుత్వ శాఖల వివరాలను ఎన్నికల కమిషన్ ఇప్పటికే విడుదల చేసింది. 33 విభాగాలకు చెందిన, నిత్యావసర సేవలు అందించే శాఖల వివరాలు ఇలా ఉన్నాయి. 1. మెట్రో, 2. రైల్వే రవాణ (ప్రయాణికులు, సరుకు రవాణ), 3. పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి ఎన్నికల కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు పొందిన మీడియా ప్రతినిధులు, 4. విద్యుత్ శాఖ, 5. బీఎస్ఎన్ఎల్, 6. పోస్టల్ టెలీగ్రామ్, 7. దూరదర్శన్, 8. ఆల్ ఇండియా రేడియో, 9. రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కోఆపరేటివ్ సొసైటీలు, 10. ఆరోగ్య శాఖ, 11. ఫుడ్ కార్పొరేషన్, 12. విమాన యానం, 13. రోడ్డు రవాణా సంస్థ, 14. అగ్నిమాపక సేవలు, 15. ట్రాఫిక్ పోలీస్, 16. అంబులెన్స్ సేవలు, 17. షిప్పింగ్, 18. ఫైర్‌ఫోర్స్, 19. జైళ్లు, 20. ఎక్సైజ్ శాఖ, 21. వాటర్ అథారిటీ, 22. ట్రెజరీ సర్వీసెస్, 23. అటవీ శాఖ, 24. సమాచార పౌర సంబంధాల శాఖ, 25. పోలీస్, 26. పౌర రక్షణ - హోం గార్డులు, 27. ఆహార పౌర సరఫరాలు - వినియోగదారుల వ్యవహారాలు, 28. ఎనర్జీ (పవర్), 29. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, 30. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, 31. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, 32. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, 33. విపత్తు నిర్వహణ శాఖలకు పోస్టల్ బ్యాలెట్ కల్పించనున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై వివరిస్తాం



పోస్టల్ బ్యాలెట్‌కు అర్హతలు ఉన్నా సంబంధిత ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి పూర్తి స్థాయిలో వివరించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇందు కోసం నంద్యాల జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా ఏపీఎంఐపీ పీడీ శివసత్యనారాయణ, సహాయ నోడల్ అధికారిగా డీపీవో మంజుల వాణిని నియమించాం. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం -12 డీ ఫారాలను అందుబాటులో ఉంచాం.

\- డాక్టర్ కె.శ్రీనివాసులు, కలెక్టర్, నంద్యాల

జిల్లాలో 36 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరం

నంద్యాల జిల్లాలో దాదాపు 36 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరమవుతాయని ఎన్నికల అధికారులు అంచనా వేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే 33 రకాల వివిధ శాఖల సిబ్బందితోపాటు, ఎన్నికల కమిషన్ తాజా మార్గదర్శకాల మేరకు దివ్యాంగులకు, మంచంపై అనారోగ్యంతో ఉండి కదలలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులతోపాటు 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. హోం ఓటింగ్‌కు సంబంధించి అభ్యర్ధన పత్రాలను తీసుకొని ఎంత మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నారో వారి జాబితాను రూపొందించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా బీఎల్‌వోలు, ఆయా సెక్టార్ అధికారులు పర్యవేక్షించేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. కాగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి దాదాపు 12 వేల మంది సిబ్బంది, అత్యవసర సేవలకు సంబంధించి 2806 మంది సిబ్బంది, విభిన్న ప్రతిభావంతులు 15432 మంది, 85 సంవత్సరాలు దాటిన వారు 5769 మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 6: త్వరలో జరగనున్న ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పీలపైనే ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు సూపరింటెండెంట్లు, పోలీసు కమిషనర్లతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎటువంటి హింసకు, రీపోలింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన భద్రత చర్యలను చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ముస్లింల పథకాలన్నీ రద్దు

- టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి
- రంజాన్ తోఫా, దుల్హన్, మైనార్టీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన జగన్
- నంద్యాలలో ముస్లిం మహిళలతో భువనేశ్వరి సమావేశం





మాటామంతి కార్యక్రమానికి హాజరైన ముస్లింలు



మహిళతో కరచాలనం చేస్తూ..

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 6: టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు ప్రవేశ పెట్టిన పథకాలన్నింటినీ జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు వచ్చిన ఆమె శనివారం ముస్లిం మైనారిటీ మహిళలతో మాటామంతీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనారిటీలకు ఏమి చేసిందని అన్నారు. అబ్దుల్‌సలామ్ అనే వ్యక్తి తన కుటుంబంతో రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనను ఆమె గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, ముస్లిం కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు, దూదేకుల కార్పొరేషన్ నుంచి రూ.కోట్లలో నిధుల సమకూర్పు, అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యా విధానం, ఎన్‌టీఆర్ ఉన్నత విద్యాదరణ, ఇమామ్‌లకు, మౌజాన్‌లకు గౌరవ వేతనం అందించిన ఘనత టీడీపీదే నని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను మహిళలు భువనేశ్వరి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, మాజీ మంత్రి, నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ మంత్రి ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు

ఆలోచించి ఓటు వేయండి

టీడీపీ, బీజేపీ, జనసేనల అజెండా ఒక్కటే : నారా భువనేశ్వరి



నాగలూటిలో చిన్నమాసుం కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

నందికొట్కూరు ఏప్రిల్ 6: ప్రజలు ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలని నారా భువనేశ్వరి అన్నారు. శనివారం నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మిడ్తూరు మండలం నాగలూటి గ్రామంలో పర్యటించారు. నియోజకవర్గ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు నాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన చిన్న మాసుం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజలతో ఆమె మాట్లాడుతూ గంజాయి, ఇసుక, కల్తీ మద్యం వ్యాపారంలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన జెండాల అజెండా ఒక్కటేనని, ప్రజల ప్రభుత్వం రావాలన్నదే ఆ కూటమి లక్ష్యమన్నారు. 2024 ఎన్నికల్లో సైకిల్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, చిన్న వెంకటస్వామి, చెరుకుచర్ల రఘురామయ్య, విక్టర్, మిడ్తూరు మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లూరులో నరసింహులు కుటుంబానికి పరామర్శ



బోయ నరసింహులు కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసాపత్రాన్ని అందజేస్తున్న నారా భువనేశ్వరి

కల్లూరు, ఏప్రిల్ 6: కార్యకర్తలే టీడీపీకి బలమని నారా భువనేశ్వరి అన్నారు. నిజ గెలవాలి యాత్ర శనివారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో సాగింది. టీడీపీ కార్యకర్త బోయ నరసింహులు కుటుంబాన్ని పరామర్శించారు. నరసింహులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ టీడీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతా మేలుకో..!

- ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు అవకాశం
- జాబితాలో పేరుందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత ఓటరుదే
- లేకపోతే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నమోదుకు వెసులుబాటు
- ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 13,72,091 ఓటర్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 6: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం. తమను పాలించే నాయకుడిని తామే నేరుగా ఎన్నుకునేలా 18ఏళ్లు దాటిన పౌరులకు భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది. అయితే చాలా మంది ఓటు నమోదులో నేటికీ అలసత్వాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. అందులో ఎక్కువగా విద్యావంతులే ఉండటం దురదృష్టకరం. ఎన్నికల రోజంటే బాధ్యత గల రోజనే విషయాన్ని మరిచి కొందరు ఇంటికే పరిమితమవుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్రం ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జనవరి 22వ తేదీన దేశ వ్యాప్తంగా ఓటరు తుది జాబితాను విడుదల చేసినప్పటికీ ఇంకా మిగిలిపోయిన వారికి కోసం ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటును నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఇందుకోసం ఫారం-6తో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశాన్ని ఇచ్చారు. కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినందున ఓటరు జాబితా నుంచి ఓట్ల తొలగింపునకు, మార్పులకు అవకాశం లేనప్పటికీ కొత్తగా ఓట్లను నమోదు చేసుకునేందుకు మాత్రమే అవకాశం కల్పించారు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

ప్లేస్టోర్‌లో భారత ఎన్నికల సంఘానికి చెందిన ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ఉంటుంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత మీ ఫోన్ నంబర్ వివరాలు పొందుపరిచి రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత లాగిన్ అయి ఓటరు రిజిస్ట్రేషన్ విభాగంలోకి వెళ్తే న్యూ ఓటరు ఓటరు రిజిస్ట్రేషన్ ఆప్షన్ కనిపిస్తోంది. దానిపై క్లిక్ చేస్తే దరఖాస్తు ఓపెన్ అవుతోంది. అందులో వివరాలు నమోదు చేసి సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ అవ్వాలి. రిజిస్టర్ యూజ్ ఏ న్యూ ఓటరు ఆప్షన్‌పై క్లిక్ చేసిన అనంతరం ఫారం-6 దరఖాస్తు ఫర్ న్యూ ఓటర్స్ అని కనిపిస్తోంది. దానిపై క్లిక్ చేస్తే ఆన్‌లైన్ దరఖాస్తు కనిపిస్తోంది. అందులో వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఆతర్వాత ఫోన్ నంబర్‌కు రెఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. ఆతర్వాత ఆన్‌లైన్ దరఖాస్తు వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి ఇంటి అడ్రస్‌కు వచ్చి పరిశీలన చేస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో పేరు చేరుస్తారు.





ఆఫ్‌లైన్‌లో ఫారం-6 దరఖాస్తు ఇలా

ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వారు బూత్‌స్థాయిలో అధికారులకు ఫారం-6 దరఖాస్తు సమర్పించాల్సి వుంటుంది. అలాగే ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. వారికి కూడా దరఖాస్తులను సమర్పించవచ్చు. అలాగే ప్రతి మండలంలో తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించి దరఖాస్తులను ఇచ్చి ఓటు నమోదు చేసుకోవచ్చు. ఓటు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు. ఇదిలావుంటే కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలు ఆయా పోలింగ్ బూతుల ఓటరు జాబితాలో చివరి పేజీలో పొందుపరుస్తారని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 13,72,091 ఓటర్లు

నంద్యాల జిల్లాలో పాణ్యం నియోజకవర్గం మినహా మిగతా ఆరు నియోజకవర్గాలకు సంబంధించి ఈ ఏడాది జనవరి 22వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను విడుదల చేసింది. ఇందులో నంద్యాల జిల్లా వ్యాప్తంగా 13,72,091 ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 6,73,425, మహిళా ఓటర్లు 6,98,404, ఇతరులు 262 మంది ఉన్నట్లు వెల్లడించారు.

కొత్తగా ఓటు నమోదు చేసుకోండి



ఓటరు జాబితా తమ ఓటు లేకపోవడం, ఇంకా ఓటు నమోదు చేసుకోకపోతే అలాంటి వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 15 వరకు కొత్తగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం లేదు. కేవలం కొత్తగా ఓటు నమోదు చేసుకునే వెసులుబాటు మాత్రమే ఉంది. ఇందుకోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మండల స్థాయిల్లో కూడా ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. -సుధారాణి,

శ్రీశైలం నియోజవర్గం రిటర్నింగ్ ఆఫీసర్

ఖనిజాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 6: ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం బెంగుళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీల్లో అక్రమంగా ఖనిజ పౌడర్ కర్నాటక సరఫరా చేస్తున్న లారీని సీజ్ చేసి రూ 50 వేలు జరిమానా వసూలు చేశాం. వెల్దుర్తి వద్ద ఐచర్ వాహనంలో నాపరాయి అక్రమంగా రవాణ చేస్తుంటే రూ.10 వేలు వసూలు చేశామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ 3, 5 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 6: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 3వ సెమిస్టర్లో 5,900కు 3081, 5వ సెమిస్టర్‌లో 10,080 కి 5652 మంది సప్లమెంటరీ విభాగంలో 3వ సెమిస్టర్‌లో 9,410కి 4,182 మంది. 5వ సెమిస్టర్‌లో 4,244 మంది పరీక్షలకు హాజరుకాగా 2,229 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

అరటి తోటలో ఎలుగుబంటి మృతి

విద్యుదాఘాతంతో కావచ్చంటున్న అటవీ అధికారులు

మహానంది, ఏప్రిల్ 6 : మహానంది మండలం నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం అనుమానాస్పద స్థితిలో ఎలుగుబంటి మృతిచెందింది. మహానందికి సమీపంలోని శంకర తపోవనం పక్కనే ఉన్న అరటి తోటలో ఎలుగుబంటి మృతదేహాన్ని అటవీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఉన్నతాధికార్లకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుండి ఎలుగుబంటి మృతదేహాన్ని మహానంది పర్యావరణ విద్యాకేంద్రం పరిసరాలకు తరలించారు. తిమ్మాపురం పశువైద్యాధి కారి కరుణాకర్ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సమీపంలోని నల్లమలలో ఎలుగుబంటి మృతదేహాన్ని ఖననం చేసారు. ఎలుగుబంటి విద్యుదా ఘాతానికి గురై మృతి చెంది ఉండవచ్చని పశువైద్యాధికారి కరుణాకర్ నిర్ధారించారు. డీఆర్వో హైమవతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణాప్రతాప్, వీఆర్వోలు సురేంద్రనాథ్ రెడ్డి, శివప్రసాద్‌తో పాటు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మృతి చెందిన ఎలుగుబంటి

ఉగాది ఉత్సవాలు ప్రారంభం

- సర్వాంగ సుందరంగా కైరుప్పల ఆలయం
- 9న పిడకల సమరం
- 13న మహా రథోత్సవం

ఆస్పరి, ఏప్రిల్ 6: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి, భద్రకాళి ఆలయంలో శనివారం నుండి వైభవంగా ఉగాది ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా నేడు ధ్వజారోహణ నిర్వహిస్తారు. సోమవారం అమావాస్య పూజ కార్యక్రమాన్ని, మంగళవారం ఉగాది పండుగ ప్రత్యేక పూజలు, బుధవారం పెద నుగ్గులాట (పిడకల సమరం), గురువారం తెల్లవారు జామున 4.05 నిమిషాలకు స్వామివారి కళ్యాణోత్సవం, 13న శనివారం సాయంత్రం మహా రథోత్సవం, 14న రాత్రి 8 గంటలకు వీరభద్ర స్వామి సొమ్ము దోచుకోవడం అనే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. సోమవారం వసంతోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రామ్‌ప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా కైరుప్పల ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆదోని మార్కెట్‌కు భారీగా ఎండు మిర్చి

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 6: ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి శనివారం ఎండు మిర్చి బస్తాలు భారీగా విక్రయానికి రైతులు తీసుకొచ్చారు. కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్ కమిటీలలో వారం రోజులుగా విక్రయాలు నిలిచిపోయాయి. అక్కడికి వెళ్లిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి రైతులు తాము పండించిన ఎండుమిర్చిని ఆదోని మార్కెట్‌కు తీసుకొచ్చారు. ప్లాట్‌ఫారం అంతా ఎటు చూసినా ఎండుమిర్చితోనే కళకళలాడింది. ఒక్కరోజే 4,163 ఎండుమిర్చి బస్తాలను విక్రయానికి రైతులు తెచ్చారు. ధర భారీగా తగ్గిపోయినప్పటికీ ఇంకింత పడిపోతుందేమోనన్న భయంతో విక్రయానికి తీసుకొచ్చారు. కనిష్ఠ ధర రూ.3,000 గరిష్ఠ ధర రూ.13,350 మధ్యస్థ ధర రూ.8,177 పలికింది. బ్యాడికి రకం ఎండుమిర్చి కనిష్ఠ ధర రూ.3,120, గరిష్ఠ ధర, రూ.7,891, తేజ రకం కనిష్ఠ ధర రూ.3,129, గరిష్ఠ ధర రూ.13,350 పలికింది.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక జడ్జి



మంచాలమ్మ సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజు

మంత్రాలయం, ఏప్రిల్ 6 : కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజు శనివారం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ఆయన మంత్రాలయంలో బస చేశారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తాహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డి, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో రైతుపై దాడి

సెక్రటరీకి ఫిర్యాదు చేసిన రైతు



గాయపడ్డ రైతు నాగార్జున

ఆదోని, ఏప్రిల్ 6: ఆదోని వ్యవసాయ మార్కెట్లో పంట దిగుబడిని విక్రయించేందుకు వచ్చిన రైతుపై, అక్కడ పని చేస్తున్న మహిళా కూలీలు తమ దగ్గర ఉన్న ఇనుప చాటలతో దాడికి తెగబడ్డారు. ముఖంపై తగిలిన గాయాలతో సెక్రెటరీ దగ్గర వెళ్లి రైతు ఫిర్యాదు చేశారు. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామానికి చెందిన రైతు నాగార్జున తన పొలంలో పండించిన 20 సంచుల వేరుశనగ పంటను విక్రయించడానికి శనివారం ఉదయం ఆదోని మార్కెట్ యార్డ్‌కు తీసుకొచ్చాడు. తమ పంట దిగుబడులకు క్వింటం రూ.5,590 ప్రకారంగా టెండర్ కూడా వేశారు. టెండర్ వేసిన యజమాని వేరుశనగ పంటను శుభ్రం చేయించేందుకు ఐదుగురు మహిళలను పంపించాడు. అక్కడికి వచ్చిన మహిళలు తమకు రూ.500 ఇవ్వాలని రైతును డిమాండ్ చేశారు. అప్పటికే నష్టాల్లో ఉన్న రైతు ఎందుకు ఇవ్వాలంటూ మహిళలను నిలదీశారు. దీంతో వారు ఒక్కసారిగా తమ చేతుల్లో ఉన్న ఇనుప చాటలతో ఆ రైతుపై దాడికి దిగారు. రైతు ముఖంపై రెండు చోట్ల గాయాలయ్యాయి. మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్‌కు రాత రూపంలో ఫిర్యాదు చేశాడు. రైతును నిలువునా దోపిడీ చేస్తున్నారంటూ మార్కెట్ యార్డ్ అధికారులపై రైతు నాగార్జున ధ్వజమెత్తాడు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి



మహాలక్ష్మి అమ్మవారి శ్రీచక్రానికి కుంకుమార్చన చేస్తున్న ప్రధాన న్యాయాధికారి కుటుంబ సభ్యులు

బేతంచెర్ల, ఏప్రిల్ 6: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామిని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ప్రధాన న్యాయమూర్తి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.7.61 లక్షలు

మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.7.61 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువ జాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.7,61,013 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు: జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 6: చిరుధాన్యాల సాగు వల్ల రైతులు లాభాల బాట పట్టే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రధాన పంటలను నిరంతరం సాగు చేయడం వల్ల ఆ పంటలకు తెగుళ్ల, ఇతర కారణాల వల్ల దిగుబడి తగ్గి నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని, అందువల్లనే చిరుధాన్యాల సాగుతో ఖర్చు లు తగ్గుతుందన్నారు. చిరుధాన్యాల పంటలు తక్కువ సమయంలోనే చేతికి వస్తాయని, చీడపీడల ప్రభావం తక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం కూడా మద్దతు ధర ఇస్తుందని అన్నారు. రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు

ముస్లింల ద్రోహి జగన్ రెడ్డి

- ఎమ్మెల్సీ ఇక్బాల్



ఫరూక్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇక్బాల్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 6: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని వైసీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్ ధ్వజమెత్తారు. పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన ఇక్బాల్ శనివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్‌ను కలిశారు. దాదాపు గంటసేపు ఇరు నాయకులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం ఇక్బాల్ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హాయంలో ముస్లిం మైనార్టీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తప్పుచేసిందన్నారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్ల తాను తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలిపారు. పదవీలో ఉంటూ ముస్లింలకు న్యాయం చేయలేకపోయానని బాధపడ్డారు. వైసీపీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యం లేకపోవడం వల్ల రాజీనామా చేశానన్నారు. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందని ఇక్బాల్ ఆరోపించారు. బైజూస్‌లో భారీ స్కామ్ జరిగిందని, లిక్కర్ మరో భారీ స్కామ్ అంటూ వైసీపీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. సీఏఏపై దుష్ప్రచారం చేస్తూ లోపాయికారిగా బిల్లుకు వైసీపీ మద్దతు తెలిపిందన్న విషయాన్ని గుర్తు చేశారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ, ప్రజా సంక్షేమం, ముస్లింల అభివృద్ధి, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆటోలు ఢీ - వ్యవసాయ కూలీ మృతి

బనగానపల్లె, ఏప్రిల్ 6: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దూదేకుల దస్తగిరి (55) అనే వ్యక్తి ఆటో ప్రమాదంలో మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు శనివారం తెలిపారు. దస్తగిరితోపాటు మరి కొంత మంది వ్యవసాయ కూలీలు పలుకూరు నుంచి మిరపకాయలు తెంచేందుకు తిమ్మాపురం ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో దస్తగిరి చేతిక తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న భారతి, లక్ష్మీదేవిలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ దస్తగిరి ఆటోలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య దూదేకుల దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పలుకూరులో గనుల పనులు లేకపోవడంతో చాలా మంది వ్యవసాయ కూలీలుగా వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదం జరగడంతో దస్తగిరి మృతి చెందినట్లు మృతుని బంధువు పేర్కొంటున్నారు. గని పనులు ఉంటే వ్యవసాయ కూలీకి వెళ్లే వాడు కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కో ఆప్షన్ సభ్యుడి అరెస్టు

నందికొట్కూరు ఏప్రిల్ 6 : ముస్లిం మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నందికొట్కూరు మున్సిపాల్టీ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. రంజాన్ మాసంలో వచ్చే బడేరాత్ సందర్భంగా ప్రార్థన కోసం తాను సాయిబాబాపేటలోని షాహిమసీద్‌కు వెళ్తూ శ్రీనివాసరెడ్డి ఇంటి ముందుకు రాగానే ఆయన తన చెయ్యి పట్టుకుని, ముఖానికి వేసుకున్న బుర్కా తీసి చూసి, నోటికి వచ్చిన బూతులు తిట్టాడని షేక్ అలియాబేగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నందికొట్కూరు టౌన్‌లోని మిడ్తూరు రోడ్డులో ఉన్న డిగ్రీ కళాశాల వద్ద వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ ప్రకాష్ కుమార్ తెలిపారు.

బ్లాస్టింగ్‌తో కూలిన ఇల్లు



కూలిన మట్టిమిద్దె

పాణ్యం, ఏప్రిల్ 6 : కంకర కోసం చేపట్టిన బ్లాస్టింగ్ పనులతో మండలంలోని తమ్మరాజుపల్లెలో శనివారం తెల్లవారుజామున ఇంటి పైకప్పు కూలింది. ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు బయటికి పరిగెత్తడంతో ప్రాణాలతో బయటపడ్డారు. సమీప గజ్జలకొండలో కంకర కోసం జరుపుతున్న బ్లాసింగ్ పనులతో ఇండ్లు కంపిస్తున్నాయని గ్రామస్థులు అంటున్నారు. అయినా అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రపోతున్న సుదర్శన్‌గౌడ్, మద్దమ్మ గజ్జల కొండ లోంచి భారీ పేలుడు శబ్దం రావడంతో మేల్కొన్నారు. ఇంతలో ఇంటిపై కప్పు నుంచి మట్టి రాలడం గమనించి బయటికి పరిగెత్తారు. ఆ తర్వాత మిద్దె కప్పు కూలిపోయింది. ఇంట్లోఉన్న సామాగ్రి పూర్తిగా దెబ్బతినింది. దాదాపు రూ 7. లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటనపై వీఆర్వో రమేష్‌సింగ్‌కు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. బాధితులకు రూ. 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని టీడీపీ నాయకులు చల్లా సురేష్, రాజేంద్ర డిమాండ్ చేశారు.

ఆలయంలో చోరీ

- రూ.2 లక్షల విలువ గల వెండి వస్తువులు దొంగతనం

మద్దికెర, ఏప్రిల్ 6: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బస్టాండు కూతవేటు దూరంలో ఉన్న పురాతన రామాలయంలో దొంగలు పడి రూ.2 లక్షలు విలువైన వెండి, బంగారు తాళిబొట్టు, డబ్బులు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం గ్రామంలోని కొంత మంది పెద్దలు, పూజారి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వెళ్లగా తలుపులు పగులకొట్టి చోరీ చేసినట్లు గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దేవాలయంలోని హుండీని, సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాల మూడు వెండి కిరీటాలను, సీతమ్మ వారి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని ఎత్తుకెళ్లారు. హుండీలో రూ.2 లక్షల మేర డబ్బు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



బంగారాన్ని బాధితురాలికి ఇస్తున్న సీఐ హనుమంతప్ప

ఆస్పరి, ఏప్రిల్ 6: తన ఆటోలో ప్రయాణిస్తూ, రూ.2 లక్షల విలువ చేసే బంగారం ఉన్న బ్యాగును వదిలేసి పోయిన మహిళకు డ్రైవర్ దాన్ని అందించాడు. మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బ్రహ్మయ్య ఆటోలో శనివారం ఆదోని నుండి ఆస్పరి వెళ్లడానికి శోభ అనే మహిళ ఎక్కింది. ఆమె ఆస్పరిలో ఆటో దిగేటప్పుడు తన బ్యాగును మర్చిపోయింది. ఆటోడ్రైవర్ బ్యాగు తెరిచి చూడగా రూ.2.50 లక్షలు విలువ చేసే బంగారం కనిపించింది. అతను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బ్యాగును సీఐ హనుమంతప్పకు అప్పజెప్పాడు. విచారణ చేసిన సీఐ బంగారాన్ని పోగొట్టుకున్న మహిళను పిలిపించి అప్పగించాడు.

టీడీపీతోనే మాదిగలకు న్యాయం

- వర్ధన్ బ్యాంకు పేరిట రూ.30 కోట్లు కాజేశారు
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఫైర్

ఆత్మకూరు, ఏప్రిల్ 6: టీడీపీతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరులోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ కులస్థులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ శ్రీశైల నియోజకవర్గంలో మాదిగల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రత్యేకించి మాదిగల విజ్ఞప్తి మేరకు శ్రీశైలంలో మాదిగ సత్రానికి స్థలానికి మంజూరు చేయించడంతో పాటు సత్రం నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం అప్పులమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలు ఊళ్లను వదిలి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పాటడుతుందని అన్నారు. గత ఎన్నికల్లో బాబాయి వివేకా హత్యతో రాజకీయం చేసిన జగన్, ప్రస్తుత ఎన్నికల్లో పించన్లను పంపిణీ చేయకుండా నీచరాజకీయాలకు ఒడిగట్టారని విమర్శించారు. అందుకే జగన్ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు ఆయన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వర్ధన్ బ్యాంకు పేరిట రూ.30కోట్ల సొమ్మును కాజేసి, దళితులకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. అదేవిధంగా సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని గాలికి వదిలేరని అన్నారు. ఆయన నిర్లక్ష్యం వల్లే నేడు సిద్దాపురం చెరువులో నీరు లేక సాగు,తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలీముల్లా, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాబిన్‌సన్‌రాజు, దరగయ్య, నాగ శేషులు, బుజ్జి, నాగయ్య, రామారావు, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

- కృష్ణాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. కాలనీకి చెందిన సుమారు వంద కుటుంబాలు వైసీపీని వీడిలో టీడీపీలోకి చేరాయి. టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, నాయకులు గోకారి, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి, పెద్దస్వామిరెడ్డి, చిన్నస్వామిరెడ్డి, రాజప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాములుగౌడ్, కొప్పరవు రవిప్రసాద్, దినకర్, లింగస్వామి, వెంకట్రావ్, జనసేన నాయకులు శ్రీరాములు, శేషగౌడ్ తదితరులు ఉన్నారు.


ఆత్మకూరులో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

'మద్యం రవాణాపై నిఘా పెట్టాలి'


చెక్ పోస్టును పరిశీలిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 6: సాధారణ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి వస్తున్న అక్రమ మద్యంపై గట్టి నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులకు సూచించారు. శనివారం నందికొట్కూరు మండలంలోని కోళ్ళబావాపురం వద్ద గల అంతర్రాష్ట్ర చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. నందికొ ట్కూరు నియోజక వర్గానికి తెలంగాణ రాష్ట్రం సరిహద్దు రాష్ట్రంగా ఉండ డంతో అక్కడి నుంచి ఏపీలోకి మద్యం వస్తుందన్న సమాచారం ఉంద న్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక వేడుకలు


శ్రీకృష్ణ దేవాలయంలో హోమం చేస్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 6: నంద్యాల పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీకృష్ణ దేవాలయ ప్రథమ వార్షిక వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు పార్థసారధికృష్ణ, నిర్వాహకులు విజయ చంద్రుడు ఆధ్వర్యంలో ఉదయం మహాగణపతి పూజ, ధ్వజస్తంభ కలశారా ధన, అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సీతాసమేత రామచంద్రుల కల్యాణం నిర్వహించారు. కార్యక్ర మంలో కృష్ణభగవాన్ సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బడేరాత్


ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

వెలుగోడు, ఏప్రిల్ 6: మండలంలో బడేరాత్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. అయితే నెల రోజులు దీక్షలు పాటించనివారు. రంజాన్ మాసంలో కనీసం బడేరాత్ బడేదిన్ రోజుల్లో నైనా కనీసం రెండు ఉపవాస దీక్షల్లో పాల్గొంటారు. దీంతో బడేరాత్‌ను పురస్కరించుకుని అధిక శాతం ముస్లింలు దీక్షలు పాటించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎలుగుబంటిని చంపిన నిందితుల అరెస్టు


ఎలుగుబంటి అవయవాలను స్వాధీనం చేసుకొని నిందితుల అరెస్టును చూపుతున్న అటవీ అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 6: ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని శివపురం ఫారెస్ట్ బీట్ పరిధిలో ఎలుగుబంటిని చంపిన నిందితులను అరెస్టు చేసినట్లు ఆత్మకూరు రేంజ్ అధికారి ఎం.పట్టాభి తెలిపారు. ఈ మేరకు శనివారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలం, శివపురం గ్రామానికి చెందిన నెత్తికొప్పుల ఏసురత్నం, మూల శిఖామణి, వడ్డెమాను సద్గుణరావు, నెత్తికొప్పుల సాయికుమార్ సుమారు పదిరోజుల క్రితం ఆత్మకూరు రేంజ్ పరిధిలోని శివపురం ఫారెస్ట్ బీట్ పరిధిలో గల పంట పొలాల్లో విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఎలుగుబంటిని చంపారు. అయితే ఎలుగుబంటిని చంపిన వారు ఈనెల 5వ తేదిన ఆత్మకూరు పట్టణ శివార్లలోని ఓ లాడ్జిలో మకాం వేసినట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. నలుగురు నిందితులతో పాటు ఎండబెట్టిన ఎలుగుబంటి అవయవాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను శనివారం ఆత్మకూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 15 రోజుల రిమాండ్‌పై నంద్యాల సబ్‌జైలుకు తరలించినట్లు చెప్పారు. అటవీ సిబ్బంది నాగేశ్వరరావు, గురువయ్య, సాహెబ్ పీరా, రాంబాబు, పాములేటి, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


ప్రతాప్

పాములపాడు, ఏప్రిల్ 6: మండలంలోని చెలిమిళ్ళ గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్ అనే వ్యక్తి అదృశ్యమయ్యారు. శనివారం పాములపాడు ఏఎస్‌ఐ ఏసయ్య తెలిపిన వివరాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి తన భర్త కనిపించడం లేదని భార్య స్వరూప ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రతిరోజు చెలిమిళ్ళ గ్రామం నుంచి పాములపాడు వెళ్లి రాత్రి ఎంత పొద్దు పోయిన ఇంటికి తిరిగి వచ్చే వారని చెప్పారు. అయితే 1వ తేదీ నుండి ఇంటికి తన భర్త ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేసిందని. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

- మహా పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు


వార్షిక వేడుకలకు పూర్ణాహుతి పలుకుతున్న దృశ్యం

ఆత్మకూరు, ఏప్రిల్ 6: పట్టణంలోని భూవరహా సహిత పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చివరి రోజైన శనివారం భూదేవీ, శ్రీదేవీ సహిత వేంకటేశ్వరస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం అశేష భక్తజనం నడుమ కమనీయంగా సాగింది. బ్రహ్మోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, నివేదన, మంగళ హారతి, చతుఃస్థానార్చన, చక్రస్నానం వంటి పూజాకైంకర్యాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతితో ముగింపు పలికారు. ఆ తర్వాత రాత్రి 7గంటల సమయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కళ్యాణ తంతును ప్రారంభించారు. ముందుగా విశ్వక్సేణారాధణ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపధారణల అనంతరం మాంగల్యధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తర్వాత కల్యాణ మూర్తులకు వైభవోపేతంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అల్పాహార వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, పట్టణంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా

వార్షికోత్సవం చివరి రోజున శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరై స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అర్చకుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేయడంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామి శేషవస్త్రాలతో సత్కరించారు. నాయకులు వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, అబ్దుల్లాపురం బాషా తదితరులు ఉన్నారు.

భక్తుడికి బంగారు గొలుసు అప్పగింత

మహానంది, ఏప్రిల్ 6: కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా చడీడాన్ గ్రామానికి చెందిన శరణ్ జీరంగలి కుటుంబ సమేతంగా శనివారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానాలు చేస్తుండగా మెడలోని రూ.లక్ష విలువ చేసే బంగారు గొలుసు పడిపోయింది. విషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బాలుడుకు తెలిపారు. స్థానిక చెంచు వ్యక్తులతో కోనేరులో వెతికించగా గొలుసు దొరికింది. ఈ గొలుసును టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు భక్తుడికి అప్పగించారు. ఆలయంలో అన్నదాన పథకానికి భక్తుడు రూ.2 వేలు విరాళం అందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

వెలుగోడు, ఏప్రిల్ 6: పట్టణంలోని శంకర్‌నగర్ కాలనీలో ఇటీవల ప్రమాదవశాత్తు పక్కిరి బుడ్డమ్మ అనే మహిళకు చెందిన పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు జిల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బాధితురాలికి టార్పాలిన్ పట్టా, చీరలు వంట పాత్రలు హైజీన్ కిట్ మంజూరు చేయించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి, స్థానిక రెడ్ క్రాస్ సొసెటీ నాయకులు మునిరుద్దీన్, నాగశేషులు బండి ఆత్మకూరు, పాములపాడు నాయకులు శ్రీనివాసులు, మణిరాజు, నాయక్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వెంకటరామిరెడ్డి, చక్రి, రమణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మహిళలకు భద్రత కరువు: శబరి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

మిడుతూరు, ఏప్రిల్ 6: వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఆరోపించారు. శనివారం నాగలూటి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో గత నెల ముస్లిం యువకుడి హత్య ఘటన, ఇటీవల రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మహిళ నమాజు చేసుకుని వస్తుండగా వైసీపీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తించడం దారుణమని అన్నారు. శ్రీనివాసరెడ్డి ముస్లిం మహిళ బురఖా ఎత్తి అసభ్యకరంగా మాట్లాడమే కాకుండా ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేయడం అమానుషమన్నారు. సొంత అక్కాచెల్లెళ్లకే మర్యాద ఇవ్వని జగన్‌ను చూసి రాష్ట్రంలో వైసీపీ నాయకులు మహిళలను చులకనగా చూస్తున్నారని బైరెడ్డి శబరి విమర్శించారు. మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముస్లిం మహిళలపై దాడులు, హత్యలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ముస్లింలకు అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ముస్లింలు బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర శివానంద రెడ్డి, గౌరు వెంకట రెడ్డి, గౌరు చరిత రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, గుండం రమణ రెడ్డి, తువ్వా భగీరథ రెడ్డి, సంపగి రవీంద్రబాబు, బాబుసాహెబ్, వెంకటేశ్వర్లు, పలుచాని మహేష్, చెరుకుచెర్ల రఘురామయ్య, తమ్మడపల్లె విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి: కలెక్టర్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, డీఆర్వో, ఎన్ఐసీ అధికారులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 6: జిల్లాలో జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పోలింగ్ అధికారుల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు వెల్లడించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1711 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధిత హెచ్‌వోడీలు ఎంట్రీ చేసిన డేటా ప్రకారం అధికారుల హోదా, మూలవేతనం ఆధారం చేసుకొని ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను కేటాయించి ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కేటాయించిన సిబ్బందికి ఈనెల 15,16 తేదీలలో క్లాస్‌రూమ్ తరహాలో శిక్షణ నిచ్చి పకడ్బందీ పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 20శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో పద్మజ, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు


నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు


మహానందిలో ఆలయం ముందు సేదతీరుతున్న కన్నడిగులు

మహానంది, ఏప్రిల్ 6: మహానంది క్షేత్రంలో శనివారం సాయంత్రం ఆలయ వేదపండితులు ప్రదోషకాల పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన గర్భాలయం ముందు ఉన్న నందీశ్వరుడికి వేదమంత్రాలతో నందీశ్వర అభిషేకాన్ని వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహానందిలో కన్నడ భక్తుల సందడి

మహానంది క్షేత్రం గత ఐదు రోజులుగా కన్నడ భక్తుల కోలాహలంతో నిండిపోయింది. ఎండను సైతం లెక్క చెయ్యక వేలాదిమంది కన్నడ భక్తులు వివిధ వాహనాల ద్వారా మహానందికి చేరుకుంటున్నారు. సాదరణంగా ఉగాది పర్వదినం రోజు మహానందిలో కన్నడ భక్తుల రద్దీ ఉండేది. ఈఏడాది ముందుగానే వేలాదిమంది కన్నడిగులు మహానందికి తరలివచ్చారు. దర్శనానికి ముందుగా ఆలయం పరిసరాల్లోని కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించి మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు కాయకర్పూరాలు సమర్పించారు. మరో నాలుగు రోజుల పాటు మహానందిలో కర్ణాటక భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉంది. దేవదాయశాఖ అధికారులు మహానందిలో తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆలయం తలుపులు తెరసి ప్రత్యేక దర్శనం పేరుతో ఉదయం 6.30 గంటల వరకు రూ.100 టిక్కెట్టు పేరుతో వసూళ్లు చేయడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఉగాది రోజు మహానందిలో కన్నడిగుల రద్దీ ఉంటుంది. అలాంటి సమయాల్లో నిరంతరం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి రూ.వంద అదనంగా వసూలు చేసేవారు. ఈ ఏడాది ముందుగానే కన్నడ భక్తుల రద్దీ ఉండటంతో ఇలా ఎక్కువగా ప్రత్యేక దర్శనం పేరుతో ఏర్పాటు చేయడంపై కన్నడిగులు దేవస్థానం అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కన్నడ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వేసవికాలంలో కర్ణాటక భక్తులు కాసేపు సేద తీరేందుకు ఆలయం పరిసరాల్లో చలువపందిళ్లు, షామియానాలతో పాటు దాహం తీర్చుకొనేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజలకు అండగా టీడీపీ : బైరెడ్డి


మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 6: నంద్యాలలోని ఆటోనగర్ వాసులకు టీడీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి శనివారం ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాకీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఆటోనగర్ ఏర్పాటుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేసి స్థాపించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఆటోనగర్‌లోని సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారం లోకి వస్తుందని, వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆటోనగర్ అసోషియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు, జడ్‌వారిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కర్నూలులోని బైరెడ్డి స్వగృహంలో ఎదురుపాడు చెందిన కుమ్మరి నారాయణ, కుమ్మరి సామన్న, జడ్‌వారిపల్లెకు చెందిన మహేష్, శ్రీనివాసులు, లింగస్వామి యాదవ్, బాలస్వామితో పాటు మరి కొంత మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బైరెడ్డి మాట్లాడుతూ వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు.

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలి

- బ్లాస్టింగ్ ధాటికి కూలిన ఇంటిని పరిశీలించిన గౌరు చరిత


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

పాణ్యం, ఏప్రిల్ 6: బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని, ఈ మేరకు అధికారులపై ఒత్తిడి తెస్తామని పాణ్యం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం తెల్లవారుజామున తమ్మరాజుపల్లెలో బ్లాస్టింగ్ పేళుల్లకు కూలిన ఇంటిని ఆమెతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. బోరు బ్లాస్టింగ్‌ల కారణంగా కొత్తగా కట్టుకున్న ఇళ్లు కూడా పేళల్ల ధాటికి పగుళ్లు ఏర్పడి కూలడానికి సిద్ధంగా ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గౌరు చరిత మాట్లాడుతూ బ్లాస్టింగ్‌లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఈపరిస్థితి దాపురించిందన్నారు. బ్లాస్టింగ్ లైసెన్సులు గ్రామంలో ఎంత మంది పొందాదని స్థానికులను అడిగారు. లైసెన్సులు లేని వ్యక్తులు బ్లాస్టింగ్ చేస్తున్నారని స్థానికులు తెలిపారు. కంకర వ్యాపారులు తమ లబ్ధి కోసం గ్రామాన్ని ప్రమాదంలో నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టరు, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రాణాపాయం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. నష్టపోయిన బాధితులకు తహసీల్దారు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. బోరు బ్లాస్టింగ్‌లతో ఇప్పటికే వ్యవసాయ బోర్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ నాయకులు రామ్మోహన్‌నాయుడు, చల్లా సురేష్, రాజేంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 6: రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ధర్మంలో టికెటు పొందిన అభ్యర్థుల విజయానికి బీజేపీ శ్రేణులు కృషి చేస్తారని నంద్యాల బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ అభిరుచి మధు అన్నారు. నంద్యాలలో బీజేపీ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ముఖ్య నాయకుల మధ్య జెండా ఎగురవేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్, సుధాకర్, లక్ష్మీరెడ్డి, బాలు, ఉపేంద్రరెడ్డి, స్వాతి, మధు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

- నీరు లేక అందని తడి
- ఆందోళనలో రైతులు


నీరులేక ఎండిన వరి పైరు

వెలుగోడు, ఏప్రిల్ 6: వెలుగోడు మండలంలో వరి సాగు చేసిన రైతులకు కన్నీరే మిగిలింది. జలాశయంలో నీరు ఉందని రెండో కారు సాగు చేసిన పంటలకు నీరందక పంట చేతి కొచ్చే సమయంలో గింజలు రాలిపోయి పంట ఎండి పోవడంతో రైతు కంట కన్నీరే మిగిలింది. మరి కొందరు బావులు బోర్లు ఉండటంతో పంటలను కాపాడు కునేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. వెలుగోడు పట్టనానికి చెందిన రాము నాయక్, లక్ష్మీబాయి దంపతులు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. అయితే పంట చేతి కొచ్చే సమయంలో సాగు నీరు అందక పోవడంతో పంటలు ఎండిపోయి రైతు ఎంతో నష్టపోయారు. 4 ఎకరాల పంట ఎండి పోవడంతో వరిపైరును కోసి పశువులకు మేతగా వాడుతున్నాడు. మరో రెండు ఎకరాల్లో చుట్టు పక్కల ఉన్న బోరు బావులతో పంటను కాపాడుకుంటున్నారు. పంట ఎండి పోవడంతో రూ.3 లక్షల పెట్టుబడి నష్టపోయానని రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.


నెర్రలిచ్చిన పొలం

వైసీపీకి షాక్

బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన వంద కుటుంబాలు

బనగానపల్లె, ఏప్రిల్ 6: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. శనివారం సాయంత్రం సంజామల మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన వంద కుటుంబాలు వైసీపీని విడి టీడీపీలో చేరారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో వీరు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బత్తుల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వైసీపీ నాయకుడు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీసీ జనార్దన్‌రెడ్డి



వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కాటసాని పరమేశ్వర్‌రెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, తెలుగు శ్రీనివాసులు, గుల్లదుర్తి సుబ్బయ్య, బెల్లం శిఖామణి, ముల్లా మహబూబ్‌మియా, మౌలాలి, ఈడిగ విశ్వనాథ్‌గౌడ్, మాదిగ సుబ్బరాయుడు, రవీంద్ర, తెలుగు ఓబులేసు, బెల్లం లాసర్, బత్తులశివశంకర్‌రెడ్డి, ముల్లా మహబూబ్, అల్లాబకాస్, బొద్దురామచంద్రారెడ్డి తదితర 100కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీసీ: బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని పెద్దపీర్లచావిడి వద్ద ఉన్న ఏక్ కమాన్ మసీదులో కమిటీ సభ్యులు జాఫర్, ఇతర మైనార్టీ నాయకుల ఆహ్వానం మేరకు శనివారం రాత్రి ముస్లింలతో కలసి బీసీ జనార్దన్‌రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మత పెద్దలను బీసీ సత్కరించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అన్వర్‌హుసేన్, అహ్మద్‌హుసేన్, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తును అంధకారం చేశారు

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 6: డోన్ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా యువత భవిష్యత్తును అంధకారంలోకి తోసేశారని, ఇదేనా మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధి? అని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం డోన్ మండలంలోని మల్యాల, యాపదిన్నె, బి. రామదుర్గం గ్రామాల్లో కోట్ల రాఘవేంద్రరెడ్డితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో ఉన్న సంపదనంతా దోచేశారని మండిపడ్డారు. డోన్ నియోజకవర్గంలో తాము వేసిన రోడ్ల మీద రోడ్లు వేసి మంత్రి బుగ్గన డబ్బు సంపాదించుకున్నారు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలన్నీ మూతపడి వేల మంది కార్మికులు రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. గ్రామాల్లో ఎంతో మంది చదువుకున్న యువత ఉన్నారని, అలాంటి వారి కోసం పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మంత్రి బుగ్గన ఎందుకు కల్పించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, మాజీ సర్పంచ్ రేగటి రాంమోహన్‌రెడ్డి రంజిత్ కిరణ్, వలసల బాలుడు, ఆలేబాదు



మల్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

పరమేష్, మల్యాల రామయ్య, మాధవక్రిష్ణారెడ్డి, యాపదిన్నె రంగన్న, సర్పంచ్ రామిరెడ్డి, బీజేపీ నాయకులు వడ్డే మహారాజ్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ప్యాపిలి, ఏప్రిల్ 6: మండలంలోని బావిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయ కుడు, మాజీ సర్పంచు వెంకటేష్‌తోపాటు 50 కుటుంబాలు శనివారం మాజీ కేంద్ర మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. కోట్ల దంపతులు బావిపల్లిలోని వెంకటేష్ ఇంటికి వెళ్లి కండువ కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈసం దర్భంగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ తమను నమ్ముకొని పార్టీలోకి వచ్చిన వారిని వమ్ము చేయమని, అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావు యాదవ్, సర్పంచు లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



టీడీపీలో చేరిన వారితో కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 6: టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత డోన్ నియోజకవర్గంలోని అర్హులైన నిరుపేదలందరికీ రెండు సెంట్ల స్థలం ఇస్తారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సుజాతమ్మను దేవరబండ టీడీపీ నాయకులు వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ 30 లక్షల గృహాలు నిర్మించి ఇస్తానని మాట ఇచ్చి పేదలను మోసం చేశాడని ధ్వజమెత్తారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

బేతంచెర్ల: మండలంలోని కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మీ ఆధ్వర్యంలో చాకలి ఎల్లయ్య, జోగి రాముడు, జోగి ఏకాంబరం, వెంకటేశ్వర్లు, ఎల్ల సుబ్బయ్య తదితర వైసీపీ కార్యకర్తలకు కోట్ల సుజాతమ్మ టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవ రెడ్డి, తిరుమలేశ్ చౌదరి, భీమేశ్రరెడ్డి, సుధాకర్, రవీంద్ర నాయక్, బైలర్ రాముడు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి: తెలుగుదేశం పార్టీతో బీసీ అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని ఎంబాయి గ్రామ పంచాయతీలో జయహో బీసీ కార్యక్రమం బేతంచెర్ల మం డల టీడీపీ కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కోట్ల సుజాతమ్మ మాట్లాడారు.

కోట్ల దంపతులను కలిసిన ఆర్యవైశ్యులు

డోన్, ఏప్రిల్ 6: పట్టణంలోని కోట్ల నివాసంలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులను ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిశారు. పార్టీలో కలిసి పని చేసేలా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్ మధ్య రాజీ కుదుర్చారు. అదేవిధంగా ఆర్యవైశ్యుల్లో కీలకంగా ఉన్న మరో వైసీపీ నాయకుడు సేనా శనివారం కోట్ల దంపతులను కలిసి మద్దతు తెలిపారు. త్వరలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

అవ్వా తాతలను మోసగించిన జగన్

డోన్, ఏప్రిల్ 6: తాను అధికారంలోకి రూ.3వేలు పింఛన్ ఇస్తానని అవ్వా తాతలకు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే జగన్ మోసం చేశారని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శనివారం పట్టణంలోని 32వ వార్డులో ఆమె ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల నివేదిత మాట్లాడుతూ పేదలకు ఇచ్చే సామాజిక పింఛన్ల పెంపులో జగన్ ఒకేసారి రూ.3వేలు ఇవ్వకుండా మోసం చేశా డని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏప్రిల్ నుంచే నెలకు రూ.4వేలు మాదిరిగా ఇస్తానని, అవ్వాతాతలకు, వికలాంగులకు, వితంతువులకు భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి కోట్రికే ఫణిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి విజయ భట్టు, ఎస్ఎండీ రఫీ, కేఈ శ్యాం, ఎల్లగౌడు, బైసాని రాజు, ప్రహ్లాద, చాటకొండ రజిని, ఎన్ఈ సరోజ, జనసేన నాయకుడు మల్లి పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్

డోన్, ఏప్రిల్ 6: వైసీపీ పాలనలో బీసీలపై దాడులు పెరిగాయని, సీఎం జగన్ బీసీల ద్రోహిగా మిగిలిపోయారని మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున అన్నారు. శనివారం పట్టణంలోని బీసీ సెల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీ మూకల చేతిలో ఎంతో మంది బీసీలు హత్యకు గురయ్యారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలంతా వైసీపీకి బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ నాయకులు రామాంజనేయులు, రంగస్వామి, శ్రీను, బీమన్న, దొరపల్లి హరి, మాధవ్ పాల్గొన్నారు.

భర్త ప్రవర్తన మార్చుకోలేదని భార్య ఆత్మహత్య

మృతురాలు గుమ్మకొండ వాసి



ఉషారాణి (ఫైల్)

యాడికి, ఏప్రిల్ 6: మద్యానికి బానిసైన భర్త ప్రవర్తన మార్చుకోలేదని భార్య ఉషారాణి (28) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంఘటన శుక్రవారం రాత్రి యాడికి మండలం తూట్రాళ్లపల్లిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. నంద్యాలజిల్లా డోన్ మండలం గుమ్మకొండ గ్రామానికి చెందిన ఉషారాణిని యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన గోపినాథ్‌గౌడ్‌కు ఇచ్చి 8సంవత్సరాల క్రితం వివాహం చేశారు. గోపినాథ్‌గౌడ్ స్థానిక సోలార్‌ప్లాంట్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు హర్షవర్థిని, తేజశ్విని ఉన్నారు. గోపినాథ్‌గౌడ్ మద్యానికి బానిసై డ్యూటీకి వెళ్లేవాడు కాదు. దీనిపై భార్యాభర్తలు గొడవ పడ్డారు. మనస్తాపంతో ఉషారాణి విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఉషారాణి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చిన్న గోపాల్ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు తెలిపారు.

బీసీలతో పెట్టుకుంటే పుట్టగతులుండవ్

డోన్, ఏప్రిల్ 6: బీసీలతో పెట్టుకుంటే వైసీపీకి పుట్టగతులుండవని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ అన్నారు. శనివా రం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలను పూర్తిగా అణగదొక్కారని మండిపడ్డారు. వైసీపీ అన్యాయాలపై పోరాటాలు చేస్తున్న ఎంతో మంది బీసీలను పొట్టన పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, రంగనాథమయ్య పాల్గొన్నారు.

గౌస్ మొద్దీన్ మృతి బాధాకరం

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 6: బనగానపల్లె పట్టణం కొండపేటకు చెందిన టీడీపీ సానుభూతి పరుడు గౌస్ మొద్దీన్ మృతి చెందడం బాధాకరమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గౌస్ మొద్దీన్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీసీ జనార్దన్‌రెడ్డి కొండపేటకు వెళ్లి గౌస్ మొద్దీన్ మృతదేహానికి నివాళులర్పించారు.

చలివేంద్రం ఏర్పాటు

డోన్(రూరల్), ఏప్రిల్ 6: వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని కొత్తబస్టాండు ప్రాంగణంలో ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డోన్ విజయ గ్యాస్ అధినేత రాజా విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ ప్రారంభించారు. ప్రయాణికులు చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఏప్రిల్ 6: మండలంలోని నేలంపాడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల పరిశీలించారు. శనివారం పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్పీ ఖాశీం ఉన్నారు.

మేం మారం..!



యు.కొత్తపల్లిలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ మన్సూర్ బాషా

డోన్, ఏప్రిల్ 6: డోన్ నియోజకవర్గంలో వలంటీర్లు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. మేము మారం.. వైసీపీ ప్రచారంలో పాల్గొంటూనే ఉంటాం అని అధికారులకే సవాళ్లు విసురుతున్నారు. శనివారం డోన్ మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో మంత్రి బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ మన్సూర్‌బాషా పాల్గొన్నాడు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించాడు.

టీడీపీ గెలుపు ఖాయం

బేతంచెర్ల, ఏప్రిల్ 6: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ అన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ మహిళలకు పెద్ద పీట వేస్తుందని అన్నారు. వైసీపీ అరాచకపాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల సమన్వయకర్త చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బుగ్గన మాధవిరెడ్డి, రామ్మూర్తి, నంద్యాల మధు, గూటం శివ, మోహన్‌గౌడు, జనసేన నాయకులు చల్లా మద్దిలేటి, శ్రీకంటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

99.6 శాతం పింఛన్ పంపిణీ పూర్తి

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 6: కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలలో 99.6 శాతం పింఛన్ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్లు కొలిమిగుండ్ల మండలం ఎంపీడీవో సాయికృష్ణ శనివారం వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాలలో వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు మొత్తం 7224 ఉండగా, ఇప్పటి వరకు 7156 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

372 మందిపై బైండోవర్ కేసులు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 372 మంది అనుమానిత వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్ రెడ్డి శనివారం తెలిపారు. కాగా సమస్యాత్మక గ్రామాల్లో ఒకటైన గొర్విమాను పల్లె గ్రామంలో అత్యధికంగా 62 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. చింతలాయపల్లె గ్రామానికి సంబంధించి 18 మంది, అంకిరెడ్డి పల్లె గ్రామానికి సంబంధించి 27 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ గోపీనాథ్ రెడ్డి వెల్లడించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఎస్ఐ



కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ

సంజామల, ఏప్రిల్ 6: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్ రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆల్వకొండ క్రాస్‌రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న 25 మంది ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధిం చారు. ఈసందర్భంగా ఎస్ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే డబ్బుతోపాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

మద్యం అక్రమ నిల్వలను గుర్తించాలి

డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

డోన్(రూరల్), ఏప్రిల్ 6: మద్యం అక్రమ నిల్వలను గుర్తించి చర్యలు చేపట్టాలని సెబ్ రాష్ట్ర కమిషన్ కార్యాలయ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. శనివారం డోన్ పట్టణంలోని సెబ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం సెబ్ పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సెబ్ పోలీసులు అవిశ్రాంతంగా పని చేయాలన్నారు. అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా విక్రేతలపై నిఘా పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డోన్ సెబ్ సీఐ జయనాథరెడ్డి, సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, ఏప్రిల్ 6: చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ-2 పరీక్షలను ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రశ్నా పత్రాలను పరిశీలించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 19వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. బాలికోన్నత పాఠశాలలో ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

'వడగాల్పులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 6: గ్రామాల్లో ప్రజలు వడగాల్పులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు అంజలి సూచించారు. శనివారం ప్రభుత్వ వైద్యశాలలో ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వడదెబ్బ సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చాగలమర్రి, ఏప్రిల్ 6: మండలంలోని చింతకొమ్మదిన్నె, చిన్నబోదనం, తిప్పనపల్లె, పెద్దబోదనం, రాంపల్లె, గొట్లూరు, నేలంపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి న్యామతుల్ల శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సౌకర్యాలను చూశారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల సహాయ అధికారులు ఉన్నారు.

ముగిసిన రంగనాయకులు స్వామి ఉత్సవాలు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 5: మండలంలోని పుచ్చకాయపల్లె గ్రామంలో జరిగిన రంగనాయకులు స్వామి ఉత్సవం శనివారంతో ముగిశాయి. అర్చకులు పట్టాభి రామయ్య, జ్యోగయ్యశర్మ, పాండురంగయ్య రంగనాయకులుస్వామికి అభిషేకం, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక హోమం చేశారు. హోమంలో దంపతులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఇఫ్తార్

రుద్రవరం, ఏప్రిల్ 6: రుద్రవరం జామియా మసీదులో ఇఫ్తార్ శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. గంధం శివకాంత్‌రెడ్డి, గంధం రాణా ప్రతాప్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో రుద్రవరం, మందలూరు, కొండమాయపల్లె, మాకినేనిపల్లె, తువ్వపల్లె, నాగులవరం, కొత్తపల్లె గ్రామాల ముస్లింలు 500మందికి పైగా పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన శివకాంత్‌రెడ్డి, రాణా ప్రతాప్‌రెడ్డిని ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో అమీర్, మహబూబ్‌బాషా, హాఫీజ్ జాఫర్‌అలీ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీరు రాజీనామా

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 6: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన గ్రామ వలంటీరుబండారు సురేష్ రాజీనామా చేసినట్లు ఎంపీడీవో రఘురామ్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

ఇంటి వద్దకే రూ.4 వేల పింఛన్



కరపత్రాలు అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 6: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రూ.4వేల పింఛన్ ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తారని బనగానపల్లె టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ద న్‌రెడ్డి స్వగ్రామం యనకండ్లలో మూడోరోజు శనివారం సాయంత్రం బీసీ ఇందిరమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ ఇంది రమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ప్రతినెల రూ.1000తో కలిపి జూలై నెలలో మొత్తం రూ.7 వేలు పింఛన్ డబ్బులు ఇంటి వద్దకే వచ్చి అందిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బల గోపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న గోవిందు, అయిసా, ఖాదర్‌బాషా, చింతకూరు సుబ్బయ్య, బొబ్బల మదనభూపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దివాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, యర్రగుడి మహేశ్వరరెడ్డి, సాదుల రామచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, 14వ వార్డు మెంబర్ బాలకృష్ణ, జనసేన నాయకుడు భాస్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అవుకులో వైసీపీకి బీటలు

వలసలు భరించలేకే దుష్ప్రచారం

బనగానపల్లె, ఏప్రిల్ 6: అవుకు మండలంలో వైసీపీకి బీటలు వారుతున్నాయని, దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు టీడీపీలో ఉన్నవారికే కండువాలు కప్పి ప్రచారం చేసుకుంటున్నారని ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన మొట్ల రామిరెడ్డి అన్నారు. శనివారం కాశీపురం గ్రామ నాయకుడు మొట్ల రామిరెడ్డి అవుకులో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ కాశీపురం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు, చనుగొండ్ల గ్రామం నుంచి 70 కుటుంబాలు, సుంకేసుల నుంచి 80 కుటుంబాలు వైసీపీని వీడి ఈనెల 5న బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారన్నారు. గతంలో చల్లా రామకృష్ణా రెడ్డి వర్గంలో కీలకంగా ఉంటూ చివరి వరకు చల్లా వెంటే నడిచారన్నారు. కాటసాని రామిరెడ్డి రాజకీయాలలో ప్రవేశించిన నాటి నుంచి మొన్నటి వరకు అవుకు మండలంలో వైసీపీలో కీలకంగా ఉంటూ వచ్చిన కాత్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డి, చల్లా విజయ భాస్కర రెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి లాంటి ముఖ్య నేతలతో పాటు తాను వైసీపీని వీడటంతో వైసీపీకి భారీ షాక్ తగిలిందన్నారు. దీన్ని తట్టుకోలేక ఆ పార్టీ వారు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

నేడు గిద్దలూరులో ప్రజాగళం

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 6: ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంజామల మండలం గిద్దలూరు గ్రామంలో ఆది వారం సాయంత్రం 4 గంటలకు ప్రజాగళం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొంటారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజాగళంను విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బడేరాత్



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చాగలమర్రి, ఏప్రిల్ 6: రంజాన్ మాసంలో అత్యంత పవిత్రమైన బడేరాత్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చాగలమర్రి గ్రామంలోని ఖిల్లా, అరబ్, జామియా, పెద్దమకానం తదితర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు ఆయా మసీదుల్లో ప్రత్యేక నమాజులు చేశారు. గృహాల వద్ద మహిళలు నమాజులు చేశారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి'

నంద్యాల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు భూమా విఖ్యాత్‌రెడ్డి, బార్గవ్‌రామ్‌నాయుడు కోరారు. ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన రాటాల కృష్ణమూర్తి, రాటాల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆవుల జగదీష్, బిల్లా నరసింహరావు, బిల్లా బాస్కర్, పసల రామయ్య వర్గాలకు చెందిన 40 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.. వీరందరికీ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీలో చేరిక

దొర్నిపాడు, ఏప్రిల్ 6: మండలంలోని ఉమాపతినగర్ గ్రామానికి చెందిన గుర్రం హరిబాబు చౌదరి, మరో 15 కుటుంబాలు ఉమాపతి నగర్ గ్రామానికి చెందిన వీవీజీఆర్ ప్రసాదు బాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల నాయకుడు మల్లేశ్వరచౌదరి, మండల కార్యదర్శి కొత్తపల్లి సురేంద్ర, ఎండూరి గోపాల్‌నాయుడు, గోపవరం కాశీ విశ్వనాథ్‌రెడ్డి, సిద్ధి సత్యం, లింగుట్ల వెంకట్‌నాయుడు, దయానందరావు తదితరులు ఉన్నారు.

వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంటు

నంద్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు మల్లపాములేటి అలియాస్ పామన్న శనివారం పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి శ్రీరంగాపురం గ్రామంలో వైసీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించిన ఈ సమావేశంలో పాల్గొన్నారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమలైన విషయం విధితమే. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

మాజీ మంత్రి అఖిలప్రియ



అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన పేరూరు గ్రామస్థులు

రుద్రవరం, ఏప్రిల్ 6: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పేరూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన చేశారు. అఖిలప్రియ మాట్లాడుతూ చాగలమర్రిలో కల్తీ మద్యం తాగి చాలా మంది పెరాలసిస్ సోకి మంచంలో ఉన్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని విమర్శించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కల్తీ మద్యం తాగి సుమారు 30 మంది మృతి చెందారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీరు వ్యవస్థను రద్దు చేస్తారన్న దుష్ప్రచారంలో నిజం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నీటి సమస్య పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పేరూరు గ్రామానికి చెందిన కోనేటి రాజు, దూదేకుల హుసేనీ, దస్తగిరి, రామిరెడ్డి, మరో 20 కుటుంబాలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. ఎల్వీ రంగనాయకులు, రామనాథరెడ్డి, బండారు బాలరాజు, చంద్రశేఖర్, రెక్కల మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.